


## జగ్జీవన్‌రామ్ సేవలు అమోఘం

**విశ్వంభర, సిద్దిపేట:** బాబు జగ్జీవన్‌రామ్ తన పరిపాలన దక్షతతో దేశానికి విశేష సేవలందించారని కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి సోమవారం పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని యువత బాబు బాటలో నడవాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బాబు ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, మార్క సతీష్ గౌడ్, కలిముద్దీన్, ఎల్ల శ్రీనివాసరెడ్డి, దాస అంజయ్య, కొలిమి భిక్షపతి, మార్క పద్మ, ఎర్ర మహేందర్, రషద్, వాహబ్, సన, రజిని తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

### మండల బిజెపి అధ్యక్షులు శ్రావణ్ కుమార్



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** జనసంఘ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మండల బిజెపి నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం జాతీయ ఐక్యత దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి దేశభక్తి త్యాగం జాతీయ సమైక్యత కోసం చేసిన పోరాటం యావత్ భారతదేశానికి చిరస్మరణీయంగా నిలిచిపోతా యన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. నాయకులు వెంకయ్య శంకర్రావు అనిల్ నర్సింలు సాయిలు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణ ను సమర్థవంతంగా నిర్వహించాలి



**విశ్వంభర, చింతపల్లి:** ఓటర్ల సవరణను సమర్థవంతంగా నిర్వహించాలని మోద్గుల మల్లేపల్లి సర్పంచ్ ముద్దం మల్లేష్ గౌడ్ అన్నారు. సర్పంచ్ అధ్యక్షతన సోమవారం ఓటర్ల సవరణ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి డిప్యూటీ తాసిల్దార్ ఎండి. అర్షద్ పాల్గొని మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అలాగే అనర్హుల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడిగా సైదులు, వార్డు సభ్యులు శివాని, గండు సైదులు, బోయపల్లి లోకేష్ అలివేలు, మద్దెల మహేష్, గడిగా సైదులు, గడిగా రాజు, ఆశా వర్కర్స్, ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ సెక్రెటరీ రాజు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



**విశ్వంభర, హైదరాబాదు :** అంబర్‌పేట అలీ కేఫ్ సమీపంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ పక్కన ఏర్పాటు చేసిన ముస్లిం శ్మశానవాటికను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సోమవారం సందర్శించారు. శ్మశానవాటికలో మిగిలిన అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, స్థానికులు తెలిపిన సమస్యలను తెలుసుకున్నారు. గుంతలు తవ్వే సమయంలో రాళ్లు ఎదురవుతున్నందున ఖననం చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గార్డెనింగ్, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమీప ప్రజలు పాల్గొన్నారు.

## పివైఎల్ నేత ఇరుగు అనిల్ సిపిఐ(ఎంఎల్)లో చేరిక

**విశ్వంభర, నెల్లికుదురు:** మండలం లోని బంజర గ్రామానికి చెందిన పి వై ఎల్ యువ నేత ఇరుగు అనిల్ తో పాటుగా మరో ఐదుగురు మండల కేంద్రం నెల్లికుదురు లో జరిగిన కార్యక్రమంలో సోమవారం సిపిఐ(ఎంల్) మాస్ లైన్ లో చేరారు. వీరిని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి ఆహ్వానిస్తూ కండువా కప్పి చేర్చుకున్నారు. సిపిఐ (ఎమ్మెల్)మాస్ లైన్ నిరంతరం కార్మికులు కర్షకులు బడుగు బలహీన వర్గాల తో పాటు అన్ని వర్గాల ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందంటారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, డివిజన్ నాయకులు జక్కుల యాకయ్య, తోట రవీందర్ కనుకు, మధు,మహేష్,వెంకటమ్మ,లక్ష్మి,తారమ్మ,సుగుణ తదితరులు పాల్గొన్నారు.



## డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులను కలిసిన టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్



**విశ్వంభర, బషీర్ బాగ్ :** డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డా.నవీన్ నికోలస్, జాయింట్ డైరెక్టర్ నర్సమ్మ ను టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఫక్రుద్దీన్ అహ్మద్, ఉపాధ్యక్షులు ఎం. భాస్కర్, ఆర్. అశోక్ లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలో అర్హులైన సూపరింటెండెంట్లకు 7 అసిస్టెంట్ డైరెక్టర్ పదోన్నతులు మంజూరు చేసి, వారి అర్హతలు, సీనియారిటీకి అనుగుణంగా పోస్టింగ్‌లు కల్పించినందుకు డైరెక్టర్ కు ఫోరం తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో స్పందిస్తూ, పారదర్శకంగా పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడి) పదోన్నతులు పొంది పోస్టింగ్‌లు పొందిన అధికారులు సురేష్ సూపరింటెండెంట్, భద్రాద్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి, డిఎస్ఈ కార్యాలయం, రమేష్ సూపరింటెండెంట్, ఐఏఎస్ఈ మసాబ్‌ట్యాంక్, ఎస్ఐఈటి కు పోస్టింగ్, యశోదమ్మ మోడల్ స్కూల్స్‌కు, దుర్గభవాని సూపరింటెండెంట్, హైదరాబాద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి, సమగ్ర శిక్షకు, సాగర్ సూపరింటెండెంట్, బాలభవన్‌కు పోస్టింగ్. ఎ. శ్రీనివాస్ రావు, సూపరింటెండెంట్, యాదాద్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి, డి ఈ వో మెదక్ కార్యాలయానికి, సి.హెచ్ శ్రీనివాస్ రావు, సూపరింటెండెంట్, కమ్మం ఎఫ్ ఏ ఓ,నిర్మల్‌గా పోస్టింగ్ పొందారు.ఈ కార్యక్రమంలో యశోదమ్మ, రమేష్, దుర్గభవాని, శివ, ఫెరోజ్ అహ్మద్, శ్రీనివాస్, అరుణ జ్యోతి, సుగుణ రెడ్డి, సతీష్, అల్తాఫ్, హఫీజ్, సీతారాం, సాయి వేణు, అనిల్, సామియుల్లా, ఉమేష్, పరమేష్, శ్రీ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకటో వార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం



**విశ్వంభర, హుస్నాబాద్ :** హుస్నాబాద్ పట్టణ పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డులో స్థానిక కౌన్సిలర్ చెన్నబోయిన అనూష విద్యాసాగర్ ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ శిబిరాన్ని పురపాలక సంఘం చైర్‌పర్సన్ దండి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు వారి నివాస ప్రాంతంలోనే ఉచిత కంటి వైద్య పరీక్షలు అందించడం అభినందనీయమని అన్నారు. ఆసుపత్రులకు వెళ్లలేని వారు, వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన వార్డు కౌన్సిలర్ చెన్నబోయిన అనూషను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్ వైద్య బృందం మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో కంటి ఆపరేషన్లు కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ హసన్, కౌన్సిలర్లు సావుల మంజుల, బత్తుల స్వరూప, బొలిశెట్టి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రజిత, గడిపి ప్రవీణ్, సింగరి, సావుల వెంకట్, సావుల మధు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ కు పద్మశ్రీ ఇవ్వాలి

**బీసీ జనసే ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ కు నివాళులు**



**విశ్వంభర, షాద్ నగర్:** భారత దేశ మాజీ ఉప ప్రధాని, స్వతంత్ర సమర యోధుడు, సమాజ నిర్మాత బాబు జగ్జీవన్ రామ్ కి కచ్చితంగా ప్రభుత్వం పద్మశ్రీ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఎమ్‌ఆర్పిఎస్ బీసీ జనసేన రాష్ట్ర నాయకులు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యలయం ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సామాజిక వివక్ష,అసమానతలు లేని ఒక స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య, సమాజ నిర్మాణం కోసం జీవితాంతం కృషిచేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర మంత్రిగా, దేశ ఉప ప్రధానమంత్రిగా పనిచేసి మచ్చలేని నాయకుడిగా ఆదర్శ జీవితం గడిపారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కరణోద్యమనేత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్‌ఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ళ ఉపేందర్ మాదిగ,రాష్ట్ర జాతీయ బీసీ జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖర అప్ప,రాష్ట్ర బీసీ జనసేన నాయకులు మేకల వెంకటేష్,జాతీయ బిసి జనసేన సీనియర్ నాయకులు వెంకటయ్య టీచర్ రవి గౌడ్,బీసీ నాయకులు,షాద్ నగర్ తాలూకా నాయకులు నియోజకవర్గం బీసీ జనసేన అధ్యక్షులు గడ్డమీది రమేష్ ముదిరాజ్,అడ్వకెట్ లింగారం లక్ష్మయ్య,కొత్తూరు అధ్యక్షులు జెనిగె శ్రీశైలం,శ్రీను, భూషణ్,మండల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇనాక్ సాహిత్యంపై కొత్త అధ్యయన గ్రంథం ఆవిష్కరణ




**విశ్వంభర, చిక్కడపల్లి :** ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం పరిశోధకులకు విస్తృత అధ్యయన అవకాశాలను కల్పిస్తుందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి. శ్రీనివాస్ అన్నారు. హైదరాబాదు చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై నిర్వహిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో వేమూరి కమలాకర్, సుజాత రచించిన 'సాహిత్యం -- నూతన దర్శనం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన పి.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇనాక్ రచనలు సమాజం, సాహిత్యం, మానవీయ విలువలను ప్రతిబింబిస్తాయని, వాటిపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. సాహితీవేత్త కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఈ గ్రంథం ఇనాక్ సాహిత్యాన్ని కొత్త కోణంలో విశ్లేషిస్తూ పరిశోధకులకు ఉపయోగపడే విధంగా రూపొందిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ అభినందనలు తెలిపారు. ప్రారంభంలో రత్నమాల బృందం సంగీత గానగోష్టిని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి. శ్రీనివాస్, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్, సాహితీవేత్త కృష్ణారెడ్డి, రచయితలు వేమూరి కమలాకర్, సుజాత, రత్నమాల బృందం సభ్యులు పాల్గొన్నారు.



## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల ఫిర్యాదుల పరిశీలన ఎస్పీ నరసింహా

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహా ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి




**విశ్వంభర, సిద్దిపేట:** ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ కమిటీ ఛైర్మన్ పూజల గోపికృష్ణ, గ్రామ సర్పంచ్ కుంచం లత వెంకట్ యాదవ్ సూచించారు. రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని రైతు వేదికలో సోమవారం సబ్సిడీ పత్తి విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రైతులు వరి పంట ఒక్కటే కాకుండా పంట మార్పిడి చేయాలని కోరారు. పంట మార్పిడితో దిగుబడులు పెరిగి రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. సర్పంచ్ లత మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయం చేయాలన్నారు. అన్నదాతలు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎవో నరేశ్, ఎఈవో ప్రదీప్, రైతులు రాములు, అంజిరెడ్డి, ఎల్లం, లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, చెన్నెకిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో గ్రామస్తులు ఇబ్బంది పడొద్దు : సర్పంచ్ దేవేందర్ నాయక్



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండలం గంగారం గ్రామపంచాయతీ లోని వర్షపు నీరు మురికి నీరు సాఫీగా వెళ్లేందుకు కాల్వకు చుట్టుపక్కల ఉన్న చెట్లు, మట్టి ని తొలగించడం జరిగింది. వర్షా కాలానికి నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా అండర్ డేనేజ్ కాలువలు శుభ్రపరచడం జరిగింది. రోడ్ల చెట్లు పొదలు ప్రజలకు ఇబ్బంది కాకుండా రోడ్ల జెసిపి తో తొలగించడం జరిగింది, గ్రామ ప్రజలకు ఇలాంటి రోగాల బారిన పడకుండా, వర్షాకాలంలో వచ్చే దోమ కాటు వల్ల టైఫాయిడ్, మలేరియా జ్వరం వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలో శుభ్రం చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు తమ ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, సర్పంచ్ దేవేందర్ నాయక్ తెలియజేశారు, గ్రామస్తులకు ఇబ్బంది కాకుండా ముందు జాగ్రత్తగా రోడ్లకి ఇరువైపులను గుంతలు మట్టి పోయించడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, వార్డ్ మెంబర్ ఎం రవి నాయక్, శ్రీనివాస్,నరేష్, కృష్ణ,గ్రామ సిబ్బంది లు శంకరయ్య, పెంటయ్య,నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ కు ఘనంగా నివాళులు



**విశ్వంభర, జి హెచ్ ఎం సి :** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఎస్సీ , ఎస్టీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు హరినాథ్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో, సామాజిక సమానత్వం సాధనలో, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక, రాజకీయ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు: భువనగిరి ఎమ్మెల్యే

**విశ్వంభర, భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మండలాల నుంచి ప్రజలు ఫోన్ ద్వారా తమ సమస్యలు, వినతులు, అభ్యర్థనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వచ్చిన ప్రతి కాల్‌కు స్వయంగా స్పందిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓర్పుగా విన్నారు. సమస్యల స్వభావాన్ని బట్టి కార్యక్రమం జరుగుతుండగానే సంబంధిత శాఖల అధికారులకు నేరుగా ఫోన్ చేసి, ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన చర్యలు చేపట్టి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదుర్కొన్నా నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలని, ప్రతి సమస్యను పూర్తిగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాలర్లు స్పందిస్తూ, గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భువనగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే కు తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కొనియాడారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను స్వయంగా విని వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి. పనితీరును పలువురు కాలర్లు అభినందించారు.

## సమాఖ్య భవన నిర్మాణ పనులను పరిశీలించిన సర్పంచ్



**విశ్వంభర, చింతపల్లి:** నల్గొండ జిల్లా చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా సమాఖ్య భవన పనులను గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అదేవిధంగా, మహిళలకు త్వరలోనే భవనం అందుబాటులోకి వచ్చేలా నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహిళా సమాఖ్య భవనం గ్రామంలోని మహిళల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి, మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని అభివృద్ధి పనులను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయడమే తమ లక్ష్యమని సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు శివర్ల కృష్ణ యాదవ్, బొడ్డు గిరి పాల్గొని నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా సాత్విక్ చారి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, హుస్నాబాద్:** శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో పోషకులు పిన్నోజు సంజీవ్ చారి, జ్యోతి రాణి దంపతుల కుమారుడు సాత్విక్ చారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థి సాత్విక్ చారి చేత అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు సంస్కృత భాషలో సంప్రదాయబద్ధంగా జన్మదిన గీతాన్ని ఆలపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించే విధంగా జన్మదిన వేడుకలను నిర్వహించడం విశేషంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సాత్విక్ చారి చేత మొక్కలు నాటించారు. ప్రతి పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్కను నాటి ప్రకృతిని సంరక్షించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు పిన్నోజు సంజీవ్ చారి, జ్యోతి రాణి, పాఠశాల ప్రధానాచార్యురాలు శ్రీలత, మాతాజీలు, ఆచార్యులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని సాత్విక్ చారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## లబ్ధిదారునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**విశ్వంభర, త్రిపురారం:** నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ఆదేశానుసారం త్రిపురారం మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఆశా కి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60,000 చెక్కును త్రిపురారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లంపల్లి జానయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మార్తి భరత్ రెడ్డి, అనుముల అనంత్ రెడ్డి, అనుముల నర్సిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి నరేష్, పి.బి శ్రీనివాస్, పి.బి రవి,శ్యామ్ సుందర్ రెడ్డి,అంజిరెడ్డి, జి చంద్రారెడ్డి, వి,సైదులు, పి కొండల్, పి,రవి, తదితరులు పాల్గొన్నారు.



# హుస్నాబాద్‌కు కమిషనర్ ఎక్కడ

**బిఆర్ ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి**



**విశ్వంభర, హుస్నాబాద్ :** హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో పట్టణంలోని ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ గత నెల రోజులుగా సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా నిర్వహిస్తుండటంతో ఎక్కువ సమయం అక్కడే గడుపుతున్నారని, దీంతో హుస్నాబాద్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తమ పనుల కోసం రోజుల తరబడి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని, అభివృద్ధి పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. ప్రతి చిన్న పనికీ కమిషనర్ అనుమతి అవసరమవుతుండగా, రెండు మూడు రోజులకు ఒకసారి గంట, రెండు గంటలు మాత్రమే కార్యాలయానికి రావడం వల్ల ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ పర్యటనకు వచ్చినప్పుడే కమిషనర్ ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్లు కనిపిస్తోందని, ఫోన్‌లో సంప్రదించాలన్నా సమావేశాలతో బిజీగా ఉన్నారని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక మున్సిపాలిటీ అయిన హుస్నాబాద్‌లోనే ఈ పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. మంత్రి పొన్నం జోక్యం చేసుకుని హుస్నాబాద్‌కు పూర్తిస్థాయి కమిషనర్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే సిద్దిపేట ఇన్‌చార్జి బాధ్యతలను రద్దు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజా సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ పార్టీ తరపున కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, భూక్యా రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్‌లను కలిసిన ఎమ్మెల్యే

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌లుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం , శాసనమండలి సభ్యులు బల్మూరి వెంకట్ ని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తో పాటు నారాయణఖేడ్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో, ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు చేపట్టిన ఇరువురు నేతలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుండాల చేనేత సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



**విశ్వంభర, గుండాల:** గుండాల చేనేత సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మొత్తం 9 మంది డైరెక్టర్ల స్థానాలకు 9 మంది అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే సరికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఖాళీలకు సమానంగా ఉండటంతో ఎన్నికల అధికారి వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి ఎన్నికల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లు జనరల్ ఏలే కృష్ణ, కస్తూరి మధు, గోలి రమేష్, చిందం ప్రకాశ్, తాటి వెంకటేశం, దుడుక లింగమూర్తి, బిట్ల ఆనంద్, మహిళా ప్రతినిధులు వల్లాల సరస్వతి, బొల్లం అనిత ఉన్నారు. ఈ నెల 10న ఎన్నికల అధికారి అధికారికంగా ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నారు. అనంతరం పాలకవర్గం సమావేశమై అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయనుంది. సంఘ సభ్యులు, నాయకులు ఏకగ్రీవ ఎన్నికలను స్వాగతిస్తూ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# గుడిసెల కూల్చివేతలు ఆపాలి: వామపక్షాల డిమాండ్



**విశ్వంభర, ముషీరాబాదు :** రాష్ట్రంలో గుడిసెలు, ఇళ్ల కూల్చివేతలను వెంటనే నిలిపివేసి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి పట్టా, గృహం కల్పించాలని వామపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం హైదరాబాదు ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించాయి. ప్రతి గుడిసెకు పట్టా ఇవ్వాలి. పేదల జోలికి వస్తే ఏ ప్రభుత్వమూ నిలవదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని, ల్యాండ్ మాఫియా నుంచి స్వాధీనం చేసుకున్న భూముల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మతో పాటు ఇతర వామపక్ష నాయకులు కూడా పేదల ఇళ్ల కూల్చివేతలను నిలిపివేసి, ఇంటి పట్టాలు, గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కలపల్లి శ్రీనివాసరావు ఈ.టి. నరసింహా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఎం.డి. అబ్బాస్ వనం సుధాకర్ కె. గోవర్ధన్ సదానంద్ భరత్ మూడ్ గణేష్ సాధినేని వెంకటేశ్వర్లు హన్మేష్ గాదగోని రవి మురహారి టి.జ్యోతి వి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడలో సంక్షేమ పథకాలపై మంత్రి సీతక్క సమీక్ష



**విశ్వంభర, మహబూబాబాద్:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ--శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సోమవారం కొత్తగూడ మండలంలో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని ప్రారంభించి, మహిళా స్వయం సహాయక సంఘాల కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్‌వోలతో సమావేశమై, ఓటరు వివరాల నమోదును బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సర్వే సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు.

కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షలో ఇందిరమ్మ ఇండ్లు, యూరియా పంపిణీ, రోడ్లు, ప్రభుత్వ భవనాలు, విద్య, వైద్యం, తాగునీరు, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, గిరిజన సంక్షేమం తదితర శాఖల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. యూరియా పంపిణీలో యాప్ సమస్యల నేపథ్యంలో అవసరమైన చోట మాన్యువల్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని, మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించేలా అధికారులు చొరవ చూపాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ప్రతులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ పురుషోత్తం, డీఆర్‌డీఓ మధుసూదన రాజు, డీపీఓ హరిప్రసాద్, ఆర్డీఓ రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సబితా ఇంద్రారెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్

**విశ్వంభర, కందుకూరు :** కందుకూరు మండలం బాచుపల్లి గ్రామంలో మాజీ విద్యా శాఖ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరువతో సీఎంఆర్ ఎఫ్ చెక్కు (రూ. 52,500) ను లబ్ధిదారుడు తాతిరెడ్డి ఇన్నారెడ్డి కి అందజేశారు., సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రావడంతో తాతిరెడ్డి ఇన్నారెడ్డి ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు దువ్వాసి నరసింహ, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి గుండాల సురేష్,ఉపాధ్యక్షులు ఎగిరిశెట్టి రాజు బీసీ సెల్ అధ్యక్షులు ఎగిరిశెట్టి భాస్కర్,కపాటి అంజి రెడ్డి, దొడ్డ కీర్తి కుమార్ రెడ్డి, ఎర్ర ప్రభు,ఎర్ర శ్రీనివాస్, ఇస్తారి శ్రీనివాస్, మద్దెల గోపాల్,ఎర్ర కిరణ్, తాతిరెడ్డి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



**విశ్వంభర, తొర్రూరు:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ నాళ్ళ కృష్ణమూర్తి అన్నారు. జిల్లా గవర్నర్ ఆదేశాల మేరకు సేవా ఆరంభంలో పర్యావరణం మొక్కలు నాటే కార్యక్రమం 6వ రోజు సోమవారం తొర్రూరు పట్టణంలోని హరిపిరాల రోడ్డులో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు రూ.5 వేల విలువ గల జనరల్ నాలెడ్జి పుస్తకాలను చిన్నారులు అందించి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాళ్ళ కృష్ణమూర్తి మాట్లాడుతూ పర్యావరణం పెరగాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. పూర్వపు జోన్ చైర్మన్ ప్రతాపని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు వాడటం వల్ల అనేక రోగాలు వస్తాయని,ప్లాస్టిక్ కవర్స్ వాడి బయట పారవేయడం వలన వాతావరణ కాలుష్యం వాటిని గోమాతలు తినడం వలన అవి వాటి పొట్టలోకి వెళ్లి అవి జీర్ణం కాకుండా వాటి ప్రాణనికే ముప్పు జరుగుతుందని. ప్లాస్టిక్ నిషేధం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి,గోశాల అధ్యక్షుడు లయన్ కుమారస్వామి,పాఠశాల ఉపాధ్యాయులు దర్గా హుస్సేన్, లయన్స్ క్లబ్ ఆఫ్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతుల వెంకటేశ్వర్ రెడ్డి, కోశాధికారి ముదిరెడ్డి రమణారెడ్డి,పర్యావరణ ప్రేమికుడు డాక్టర్ రవి, ఉపాధ్యాయులు రేణుక ,దర్గా హుస్సేన్, రోజా, మౌనిక, మమత, పల్లవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలి



**విశ్వంభర, సిద్దిపేట:** ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బీఎల్పీ పార్టీ జిల్లా నాయకుడు దబ్బెట ఆనంద్ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేయాలని కలెక్టరేట్ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ పారదర్శకంగా సర్వే నిర్వహించి, అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముండే పేదలను బలవంతంగా ఖాళీ చేయకుండా వారి గృహ హక్కును చట్టబద్ధంగా పరిరక్షించాలన్నారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎల్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడవేర్గు శ్రీహరి, నాయకులు దానబోయిన రాజు, బీడీఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు దబ్బెట రాకేశ్, జిల్లా నాయకులు పంపరి అశోక్, శ్రీనివాస్, దానబోయిన పరమేశ్వర్, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ వ్యవస్థాపక దినోత్సవం



**ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం కొనసాగుతుంది..**

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి మంద కుమార్**

**విశ్వంభర, హుస్నాబాద్ :** ద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ 32వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మాదిగ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, ఉద్యమ నినాదాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాట్లాడుతూ, 32 ఏళ్ల క్రితం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనే లక్ష్యంగా జూలై 7న మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్‌ను స్థాపించారని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లి, ఎస్సీ వర్గీకరణ సాధనలో ఉద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎస్సీ వర్గాల్లోని 59 ఉపకులాలను గుర్తించి 15 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తర్వాత రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులోకి రావడం ఉద్యమ విజయమని పేర్కొన్నారు.మాదిగల హక్కుల పరిరక్షణ కోసం ఎమ్మార్పీఎస్, మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాటం నిరంతరం కొనసాగుతుందని మంద కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

## ఆపరేషన్ ముస్కాన్-12ను విజయవంతం చేయాలి: కలెక్టర్ స్నేహ శబరీష్



విశ్వంభర, మహబూబాబాద్: ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును బాధ్యతగా స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి చట్ట నిబంధనల మేరకు అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్వహణతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రజావాణిలో ప్రధానంగా భూ వివాదాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ, మున్సిపల్, పంచాయతీ సమస్యలకు సంబంధించిన మొత్తం 225 దరఖాస్తులు అందాయి. వాటిని శాఖల వారీగా ఆన్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులకు పంపించి, నిర్దేశిత గడువులో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని ఈ నెల 31 వరకు జిల్లావ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తప్పిపోయిన, పారిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చడం, బాలకార్మికులను రక్షించడం కోసం అన్ని శాఖలు, పోలీసు విభాగం సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఇటుక బట్టీలు, బేకరీలు, మెకానిక్ షాపులు, నిర్మాణ పనులు తదితర ప్రాంతాల్లో బాలకార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, డీఆర్వో నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గాగిరెడ్డి పల్లెలో చాడ పరామర్శ

విశ్వంభర, చిగురుమామిడి : చిగురుమామిడి మండలంలోని గాగిరెడ్డిపల్లిలో సీపీఐ సీనియర్ నాయకులు దొంతరవేణి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాన్ని సోమవారం సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పరామర్శించారు. వెంకన్న సీపీఐకి అంకితభావంతో పనిచేస్తూ విధేయుడుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశాడని అన్నారు. గ్రామ కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పార్టీ అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా అమలు చేసేవాడని కొనియాడారు. వెంకన్న మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వీరి వెంట రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందే స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తేరాల సత్యనారాయణ, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య, మంద ఎల్లయ్య, ఎండి ఉస్మాన్ పాషా, ఎలగందుల రాజు, తాళ్లపల్లి చంద్రయ్య, బందెల శ్రీనివాస్, సింగిరెడ్డి బాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నూతన విప్ ఛాంబర్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ వీరేశం



విశ్వంభర, రామన్నపేట: ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం హైదరాబాద్ లోని అసెంబ్లీ ప్రాంగణంలోని నూతన "విప్ ఛాంబర్"ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం.నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తదితరులు హాజరై వేముల వీరేశం కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే వీరేశంకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సేవలో మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## తిప్పాపూర్‌లో పాముకాటుతో వ్యక్తి మృతి

విశ్వంభర, వేములవాడ: వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని తిప్పాపూర్‌కు చెందిన ఎల రాజయ్య (63) అనే రైతు పాముకాటుతో సోమవారం మృతి చెందారు. ఉదయం పంట చేను వద్దకు వెళ్లగా అక్కడ పాము కుట్టినట్లు గుర్తించి ఇంటికి వచ్చారు. వెంటనే హుటా కొట్టిన వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చేరుకున్న మరుక్షణమే కుప్పకూలిపోయాడు. దీంతో వైద్యులు పాముకాటుతో మృతి చెందినట్లుగా తెలిపినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య పోచవ్వ, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉండగా ఒకరు ఏడవ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, దేవరాజు ఉన్నారు.

## కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో గిరిజనులకు నాణ్యమైన విద్య

: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



విశ్వంభర, జైనూర్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించారని ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం బుసిమెట్టలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బిడ్డల చదువుకు , భద్రతకు నాటి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కంపౌండ్ వాల్ నిర్మాణం పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఫాక్స్ చైర్మన్ కొడప హన్ను పటేల్, జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజులాల, ఉపాధ్యక్షుడు శంకర్ కొలం, నాయకులు సతీష్ మండే,మాజీ సర్పంచ్ కొముర శ్యామ్ రావు, సర్పంచులు. ధ్రువ సింధు, బావ్బావ్ రావు, మిశ్రం నగేష్, ఉప సర్పంచులు కుండలిక్ విశ్వనాథ్ , అధికారులు పాల్గొన్నారు.

## కటికెనపల్లిలో పూర్వ ప్రాథమిక పాఠశాల ప్రారంభం

విశ్వంభర, ధర్మారం: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక (ప్రీ-ప్రైమరీ)పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ ప్రారంభించారు. ప్రీ -ప్రైమరి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రీ - ప్రైమరీ పాఠశాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ఈ పాఠశాలకు పంపించాలని ఆయన సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే విషయంలో ప్రతీ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్న సామర్థ్యాలపై ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా బోధిస్తున్న పాఠశాల హెడ్మాస్టర ఎన్ మోతిలాల్ నాయక్ ను, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కటికనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ పెద్ది వెంటేశ్వర్లు, సర్పంచ్ చేపూరి లచ్చయ్య, వార్డు సభ్యురాలు తాళ్లపెల్లి హేమలత, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణరెడ్డి, విద్యా వాలంటీర్ బీ సంధ్య, సీఆర్‌పీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానము హుండి ఆదాయం రూ. 59.41.973 లక్షలు



విశ్వంభర, జి హెచ్ ఎం సి : ప్రసిద్ధి చెందిన శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానములోని 102 రోజుల హుండీల ఆదాయము దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమీషనరు ఏ. చంద్ర శేఖర్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి యన్. లావణ్య, మాజీ ధర్మకర్త ఎనుముల రవీందర్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబంది, వివిధ సేవా సంఘాల వాలంటీర్ల సమక్షములో విప్పి లెక్కించగా రూ.59,41,973 (అక్షరాల ఏబది తొమ్మిది లక్షల నలుబది ఒక్క వేల తొమ్మిది వందల డెబ్బది మూడు రూపాయలు మాత్రమే) వచ్చినవి. విదేశీ కరెన్సీ 172 యు.ఎస్. డాలర్లు, 10 ఆస్ట్రేలియా డాలర్లు, 102 మలేశియా రింగిట్స్, 135 ఉ.ఏ.ఇ.దిర్హాంస్ లు వచ్చాయి.

## యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు..

మంత్రి లక్ష్మణ్ కుమార్

విశ్వంభర, గొల్లపల్లి : యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామంలో జగిత్యాల జిల్లా మామిడి రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ హాజరయ్యారు. రైతులు వరి సాగును తగ్గించి మామిడి కూరగాయలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని సూచించారు. గత రబీ సీజన్లో 5000 మెట్రిక్ టన్లో ధాన్యం కొనుగోలు చేశామని, ఆ ధాన్యంతో గోదాములు మిల్లులు పూర్తిగా నిండిపోయాయని చెప్పారు. జిల్లా ఉద్యాన అధికారి లత, పొలాస శాస్త్రవేత్త స్వాతి, కొమ్మ కత్తిరింపుల ప్రత్యేక అధికారి భగవాన్ మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపుల అధికారి భగవాన్ లు రైతులకు కొమ్మ త్రించే విధానము మందుల యాజమాన్యం నీటిపారు గలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శోభన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతోష్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం కావాలనే కుట్ర చేస్తోంది

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



విశ్వంభర, పెద్దపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పంట పొలాలకు నీళ్లిస్తే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందో అని కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం కావాలనే కుట్ర చేస్తున్నదని, వర్షాలు లేక సాగు నీటి కోసం రైతులు తండ్లాడుతుంటే కేసీఆర్‌పై కక్షతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రైతులను ముంచుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల ఈశ్వర్ ఫైర్ అయ్యారు. పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, మాజీ జడ్పీటీసీ గంట రాములుతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ గేట్లు అలా తెరిచి ఉండగానే.. కన్నెపల్లి పంపు హౌజ్ పంపులు ఆన్ చేసి అక్కడ వృథాగా సముద్రంలో కలవడానికి వెళుతున్న లక్ష క్యూసెక్కుల నీటిని ఒడిసి పట్టి తెలంగాణ పంట పొలాలకు నీళ్లు ఇవ్వవచ్చని స్పష్టం చేశారు. అలా చేయడం వల్ల ఎలాంటి నష్టం లేదని, మేడిగడ్డ బ్యారేజీకి కన్నెపల్లి పంపు హౌజ్‌కు మధ్య దాదాపుగా 13కిలో మీటర్ల వరకు దూరం ఉంటుందన్నారు. ఆదివారం ఇదే విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యావత్ ప్రపంచ మీడియాకు చూపించారన్నారు. కన్నెపల్లిలోని లక్ష్మీ పంపు హౌజ్ పంపులను ఆన్‌చేసి తెలంగాణలోని చెరువులు కుంటలు, ప్రాజెక్టులను నింపవచ్చన్నారు. ఈ విషయాన్ని పక్కన పెడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులు పిచ్చి పట్టినట్లుగా కాళేశ్వరంపై మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌పై కోసంతో, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న ద్వేషంతో తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నారన్నారు. వర్షాలు లేక రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తుంటే నీరెత్తిపోయలేక నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. నీళ్లెత్తిపోస్తే భద్రాచలం కొట్టుకుపోతుందనడం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ హయాంలో పంపుల ద్వారా ముందస్తుగా నీళ్లు నింపుకునేదని వివరించారు. నీళ్లు వృథాగా పోతున్నా కాళేశ్వరంపై విషం కక్కుతూ రైతులను ప్రజలను కాంగ్రెస్ నేతలు మభ్య పెడుతూ కాలం గడుపుతున్నారన్నారు. కాళేశ్వరం అంటేనే కేసీఆర్.. కేసీఆర్ అంటేనే కాళేశ్వరం.. అందుకే కాళేశ్వరం పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదని, 3 బ్యారేజీలు, 21 పంప్ హౌజ్ లు, ఇలా అనేక సమూహాల కలయికే కాళేశ్వరం అన్నారు. ఒక్క రెండు పిల్లర్లు కుంగిపోయిన సాకు చూపించి రైతులను గోస పెడుతున్నారన్నారు. ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికలో ఎక్కడా కాళేశ్వరంపై వ్యతిరేకంగా నివేదిక ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం రిపేర్ కావద్దు.. రైతులకు నీళ్ళివ్వద్దు.. అనేదే కాంగ్రెస్ ప్రభుత్వ నినాదం అన్నారు. 250టీఎంసీల నీటి ప్రవాహానికి తట్టుకొని నిలిచింది మేడిగడ్డ బ్యారేజ్ అన్నారు. రాష్ట్రంలో పోలవరంలో కాపర్ డ్యాం కొట్టుకుపోతే.. ఎన్‌డీఎస్‌ఏ రాదు.. కేవలం కాళేశ్వరంకు మాత్రమే రావడంలోని ఆంతర్యం ఏమిటో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎస్‌ఎల్‌బీసీ కూలి 8మంది చనిపోతే ఇప్పటి వరకు వారి శవాలను కూడా చూపించలేని చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఎల్‌నినో విపత్తు వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా.. కాంగ్రెస్ సర్కారుకు సోయి లేదన్నారు. రెండేండ్లు కాళేశ్వరం పంప్ హౌజ్‌లు ఆన్ చేయకున్నా.. వర్షాలతో రైతులు సాగు చేసుకున్నారన్నారు. కానీ ఇప్పుడు ఎల్‌నినో విపత్తు వస్తున్నా కాళేశ్వరం పంపులు ఆన్ చేయరా..? అని ఆయన ప్రశ్నించారు. నీళ్ళిస్తే పంటలు పండుతాయి.. పంటలు పండితే పంట కొనాలి.. కొంటే బోనస్ ఇవ్వాలి.. రైతు భరోసా ఇవ్వాలి.. యూరియా ఇవ్వాలి.. కరెంటు ఇవ్వాలి.. ఇలా ఏవీ ఇవ్వకుండా ఉండటం కోసమే రైతులను ప్రభుత్వం సాగు నీటిని ఇవ్వకుండా నిలువునా ముంచుతున్నదన్నారు. ఇవన్నీ తప్పించుకోవడానికే రైతులకు కాళేశ్వరం నీళు ఇవ్వడం లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో యూరియా కోసం దిక్కుమాలిన యాప్ పెట్టారని, బోనస్ ఎగగొట్టడం కోసం 7 సన్న రకాలు తెచ్చారని, రైతులను సర్వ నాశనం చేసేందుకే కంకణం కట్టుకున్నారన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని, ఇప్పటికైనా కన్నెపల్లి పంప్ హౌజ్‌లు ప్రారంభించి రైతులకు నీళ్లివ్వాలని డిమాండ్ చేశారు.

## అనాథ వృద్ధుల ఆశ్రమానికి రూ.20 వేల విరాళం

విశ్వంభర, ముకరంపుర : ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీ ఎన్పీడీసీఎల్) వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు చారిటబుల్ ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందు నిలుస్తోంది. కరీంనగర్ లోని రామడుగు మండలం వెలిచాల లోని స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమానికి సోమవారం రూ.20 వేల మొత్తాన్ని చెక్కు రూపంలో ఆశ్రమం నిర్వాహకులకు ఎన్పీడీసీఎల్ సీఈ(హెచ్ ఆర్డీ) మాధవరావు, కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ ఆర్ రవీందర్ అందజేశారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్పీడీసీఎల్ చురుకుగా పాల్గొంటున్నదని సీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు, ఎస్ఏఓ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కేసముద్రంలో ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి



విశ్వంభర,కేసముద్రం: కేసముద్రం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే సెంటర్‌లో భారతీయ జనతా పార్టీ కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ స్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కన్వీనర్ బోగోజు నాగేశ్వర చారి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహారెడ్డి, గౌరవ అతిథిగా కేసముద్రం మండల శాఖ అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల నరసింహారెడ్డి, గౌరవ అతిథిగా కేసముద్రం మండల శాఖ అధ్యక్షుడు ఉప్పునూతుల రమేష్ లు మాట్లాడుతూ,దేశ సమగ్రత, ఐక్యత కోసం శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు అమూల్యమైనవి.కాశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం ఆయన చేసిన పోరాటం దేశ చరిత్రలో నిలిచిపోతుంద"ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహీ చలేంగే" అనే సిద్ధాంతంతో ఆయన దేశ రక్షణకై పాటుపడ్డారు.ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మంగిశెట్టి నాగయ్య, లేంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, గాంధీ వెంకట్ రెడ్డి, ఐత సారయ్య, ముదిరెడ్డి మురళి, పరకాల మురళి, మహమ్మద్ ఖాసిం, బానోత్ రాము, వాంకుడోత్ నరేష్, ముడావత్ అశోక్, సుధాకర్, పెరమండ్ల నవీన్, చిట్టోజు చక్రధర్, శక్తి కేంద్రాల ఇన్చార్జులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు మరియు శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోచారంలో రేషన్ బియ్యం దుకాణం ప్రారంభం

విశ్వంభర, పెద్దకొడప్గల్ : కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్ మండలంలోని పోచారం గ్రామంలో నూతన రేషన్ బియ్యం దుకాణాన్ని సోమవారం తహసీల్దార్ రాజశేఖర్ , ఎంపీడీవో అభినవ్ చందర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి సకాలంలో పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని డీలర్‌కు సూచించారు. రేషన్ పంపిణీలో ఏవైనా సమస్యలు ప్రజలకు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామంలో రేషన్ దుకాణం ప్రారంభం కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ పటేల్, ఎంపీవో లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు శామప్ప పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చెట్లను నరికిన వారికి జరిమానా

విశ్వంభర, సిరికొండ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. అయితే కొందరు వ్యక్తులు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని కారణంతో మరికొందరు చెత్తను వారికి చేసుకు కంచె వేసుకుంటున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్చెట్లు నరికిన ఒకరికి రూ. 2వేలు, మరొకరికి రూ. 1000 జరిమానా విధించారు. ఎవరైనా రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లను నరికితే వారిపై కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకుంటామని కార్యదర్శి, సర్పంచ్ గోవింద్ తెలిపారు.

## శ్రీరాములపేట సగర సంఘం అభివృద్ధికి ఉపాధ్యాయుల చేయూత



విశ్వంభర, వీణవంక : శ్రీరాములపేట సగర సంఘం అభివృద్ధికి ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయుల చేయూతనందించారు. గ్రామానికి చెందిన సగర (ఉప్పర) కులస్తులు ఇటీవల గ్రామంలో కమ్యునిటీ హాల్ నిర్మించుకునేందుకు కొంత భూమిని కొనుగోలు చేశారు. ఆ స్థలం కొనుగోలు కోసం, సగరుల అభివృద్ధికి తమ వంతు సహాయంగా గ్రామానికి చెందిన విద్యావంతులు, ఉపాధ్యాయులైన సగర కులానికి చెందిన దేవునూరి కుమారస్వామి సగర, దేవునూరి రఘు సగర, కుర్మిండ్ల సారయ్య సగర మగ్గురు కలిసి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందుబాటులో ఉన్న సగర కమిటీ, బంధువులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సగర సంఘం కమిటీ సభ్యులు దేవునూరి రాజేందర్ సగర, కుర్మిండ్ల మల్లయ్య సగర మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ కోరికను మన్నించి సంఘం అభివృద్ధికి వారి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దేవునూరి కుమారస్వామి సగర, దేవునూరి రఘు సగర, కుర్మిండ్ల సగరను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాసు, మాజీ అధ్యక్షుడు ఏరుకొండ ప్రసాద్, కుర్మిండ్ల తిరుపతయ్య సగర, సాంబయ్య, జనార్ధన్, ప్రభాకర్, శ్రీనివాస్, అశోక్, రాజుకుమార్ తదితర సగర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## సిఎస్ సి కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి



విశ్వంభర, ఇనుగుర్తి: ప్రభుత్వ సర్వీసులకు చెందిన కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్ సి)భాస్కర డిజిటల్ సేవ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై గంగారపు కరుణాకర్ సూచించారు. మండల కేంద్రం ఇనుగుర్తి చిన్న బస్టాండ్ వద్ద దార్ల భాస్కర్ ఏర్పాటు చేసిన సిఎస్సి డిజిటల్ సేవ కేంద్రాన్ని ఎస్సై కరుణాకర్ ప్రముఖ వేద పండితులు కృష్ణమాచార్యుల వేద మంత్రోచ్ఛరణల మధ్య కోమటిపల్లి సర్పంచ్ మద్దెల బిక్షపతి గౌడ్, దిశ సభ్యులు గుజ్జునూరి బాబురావు, హెచ్ఎం అమ్మ యాకయ్య తదితర ప్రభృతులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ సేవలు అవసరమని,సామాన్యుడికి ప్రభుత్వ సేవలను మరింత వేగంగా,పారదర్శకంగా అందిస్తుందని దీనిని సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వేముల శ్రీనివాస్, గుజ్జునూరి శ్రీకాంత్,మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, పింగిలి శ్రీనివాస్,గంజి శ్రీనివాస్ రెడ్డి,గండు నాగన్న, రేషన్ డీలర్ బేతమల్ల భారతమ్మ,బూర రజనీకాంత్,సాక్రు బాయ్,జల్లే ఉపేందర్, వల్లంల మురళి, పప్పుల యాకయ్య, నాగెల్లి కిరణ్ కుమార్,అమరేందర్, మోటమర్రి వినయ్,ముఖేష్,మద్దెల మురళి, ఉబ్బని సాంబయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పేలిన రైస్ కుక్కర్

విశ్వంభర, నాగర్ కర్నూలు : నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ పట్టణం పదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో రైస్ కుక్కర్ పేలి చిన్నారులకు గాయాలయ్యాయి. గాయపడ్డ చిన్నారులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైస్ కుక్కర్‌లో వండిన తరువాత ఆయా దానిని చిన్నారుల ఎదుటే తీయడంతో ఒక్కసారిగా పేలింది. దీంతో అక్కడే ఉన్న చిన్నారులు గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సూపరింటెండెంట్ శ్రీనివాస్, చిన్నపిల్లల డాక్టర్ యాదగిరి బిల్లా గాయపడ్డ చిన్నారులకు వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న సీడీపీవో మహేశ్వరి అక్కడికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం వహించిన ఆయాపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్ వెంటనే ఆసుపత్రికి వెళ్లి చిన్నారులను పరామర్శించారు.



## గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ.. త్వరితగతిన పరిష్కారానికి ఆదేశం

**విశ్వంభర, భద్రాచలం:** గిరిజనుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజనుల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన దర్బార్ కేవలం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం కాదని, ప్రభుత్వ పాలనను నేరుగా గిరిజన గ్రామాలకు చేరవేసే ప్రజా వేదిక అని పేర్కొన్నారు. గిరిజనులు సమర్పించిన ప్రతి వినతిని మానవీయ దృక్పథంతో పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పురోగతిని నిరంతరం సమీక్షించి లబ్ధిదారులకు సమాచారం అందించాలని సూచించారు. దర్బార్‌లో భూమి, పోడు భూముల హక్కులు, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్, వ్యవసాయ రుణాలు, రైతుబంధు, గృహవసతి, ఉపాధి, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని, భూమి సమస్యలను రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు, రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, గిరిజన యువత, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్య శిక్షణలు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందనతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

### సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలి: ఏడీఎంహెచ్‌వో సైదులు



**విశ్వంభర, భద్రాచలం:** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏడీఎంహెచ్‌వో సైదులు వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు మారుమూల గ్రామాల్లో గర్భిణీలను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రసవాలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. గుత్తికోయ గ్రామాలు, గూడేలు, తండాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయాలని, పారిశుద్ధ్యం, దోమల నివారణ, పరిశుభ్రమైన తాగునీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర మందులు, మలేరియా నిర్ధారణ కిట్లు, గర్భిణీలకు అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందితో సమన్వయం పెంచి ప్రతి ఇంటికీ వైద్య సేవలు చేరేలా చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులపై గ్రామాల వారీగా ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో ఏజెన్సీ పరిధిలోని వివిధ మండలాల వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు మృతి మరొకరికి గాయాలు

**విశ్వంభర, కందుకూర్ :** కందుకూరు మండలం దెబ్బడగూడ గేట్ సమీపంలో శ్రీశైలం హైవేపై మయూరి ఫీడ్ కంపెనీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మైసిగండి మైసమ్మ అమ్మవారి దర్శనం ముగించుకుని, హైదరాబాద్ ఎల్బీనగర్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు హోండా యూనికాన్ మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ కు వెళ్తున్న సమయంలో, కడ్తాల్ వైపు నుంచి వస్తున్న భారత్ బెంజ్ పాల ట్యాంకర్ ( టీఎస్ 05 యుసి 7771) అతివేగంగా, ద్విచక్ర మోటార్ బైకును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యలగండుల సాయి కృష్ణ (32) అక్కడికక్కడే మృతి చెందగా, ఆయనతో ప్రయాణిస్తున్న పతిపాక సాయి కిరణ్,(31)కు చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. సంఘటన విషయము తెలుసుకున్న కందుకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటన పరిశీలించిగా ఒకరు మృతి చెందారు, మరొకరికి గాయాలయ్యాయి. సంఘటన స్థలన మృతి చెందిన యాల గండుల సాయి కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మరొకరిని మెరుగైన వైద్యం కోసం తరలించారు. మృతుడి భార్య యలగండుల మైత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన పాల ట్యాంకర్ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్న కందుకూరు పోలీసులు.



# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**విశ్వంభర, మహబూబాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25వ తేదీ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్ల వివరాలు నమోదు చేసిన పిదప తిరిగి తీసుకొని సంబంధిత బిఎల్ఓ యాప్ లో డిజిటైజేషన్ చేపట్టాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకు వాలంటీర్లను ఉపయోగించుకొని ఓటర్లకు సహాయ పడాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డిజిటైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహాయం అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నేటి వరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేయడం జరిగిందని, 6.8 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, వచ్చే సోమవారం నాటికి డిజిటైజేషన్ పూర్తి చేస్తామని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందీగా చేపడతామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు కార్యాచరణ ప్రకారంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, తొర్రూరు ఆర్.డి.ఓ గణేష్, ఎస్డిసి నిశాంత్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, మరిపెడ తహసిల్దార్, క్రిష్ణవేణి, మహబూబా బాద్ తహసీల్దార్ రాజేశ్వర్,ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**విశ్వంభర, సూర్యాపేట:** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు,డీపీఓ 5 మున్సిపాలిటీ 5, డిడబ్ల్యూఓ 4 మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 76 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజు, జడ్ పిసిఇఓ శిరీష డీపీఓ యాదగిరి, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, సిపిఓ కిషన్ డిఇఓ అశోక్ , సంక్షేమ అధికారులు నరసింహారావు, దయానంద రాణి ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

# రైతులకు అండగా బిఆర్ఎస్ : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, కందుకూరు :** కందుకూరు మండలం సార్లరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోతుబండ తండాలో, ఫోర్త్ సిటీ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులకు భరోసాగా బి ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది అని,మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రైతులు నష్టపోకుండా రీ సర్వే చేసి రైతులను న్యాయం చేయాలని లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని అన్నారు. అభివృద్ధి పేరుతో రైతు భూమిని తీసుకుంటే, న్యాయమైన నష్టపరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదుపరి కార్యక్రమంలో మంగల్లి గడ్డ తండా రైతులు ధర్నా నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచులు. ప్రవీణ్ నాయక్,గోవర్ధన్ నాయక్,పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీ నరసింహ రెడ్డి, మన్నే జయేందర్ ముదిరాజ్, సురసాని సురేందర్ రెడ్డి, దేవరశెట్టి చంద్రశేఖర్, మేఘనాథ్ రెడ్డి, తాండ్ర ఇందిరా దేవేందర్, కాకి ఇందిరాదశరథ ముదిరాజ్,దామోదర్ గౌడ్, ప్రకాష్ రెడ్డి, పొట్టి ఆనంద్, దేవీలాల్, బ్రాహ్మణపల్లి జ్యోతి చంద్రశేఖర్, గుండాల సురేష్, పొన్నం అంజయ్య, బేగర్ కంచ సర్పంచ్ వెంకటేష్ నాయక్, ఉప సర్పంచ్ శివ ముదిరాజ్, కురుమిద్ద గ్రామం సర్పంచ్ నీలం శ్రీవిద్య – శ్రీ రాములు ముదిరాజ్, తేరేటి రాజు ముదిరాజ్, కాకి రవీందర్ ముదిరాజ్, అరుణ్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రావూరి సాహిత్యం సమాజానికి అద్దం: మధుసూదన్ రావు




విశ్వంభర, చిక్కడపల్లి : పెద్ద చదువులు చదవకపోయినా సామాన్య స్థాయి నుంచి సాహితీ సృజనతో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న మహోన్నతుడు రావూరి భరద్వాజ అని దూరదర్శన్ పూర్వ సంచాలకుడు డాక్టర్ పి. మధుసూదన్ రావు అన్నారు. హైదరాబాదు చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని లలిత కళా వేదికపై జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావూరి భరద్వాజ జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా రావూరి భరద్వాజ సాహితీ పురస్కారాన్ని రచయిత పరవస్తు లోకేశ్వర్‌కు, రావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారాన్ని గాయని హారిప్రియకు ప్రదానం చేశారు. లోకేశ్వర్‌కు రూ.10 వేల నగదు, హారిప్రియకు రూ.5 వేల నగదు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డాక్టర్ పి. మధుసూదన్ రావు మాట్లాడుతూ రావూరి భరద్వాజ రచనలు సమాజ వాస్తవాలను ప్రతిబింబించాయని, ముఖ్యంగా 'పాకుడురాళ్లు' నవల తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన బైస దేవదాసు మాట్లాడుతూ పరవస్తు లోకేశ్వర్ యాత్రా సాహిత్యంలో విశిష్ట కృషి చేశారని, హారిప్రియ శాస్త్రీయ సంగీతంలో గుర్తింపు పొందారని అభినందించారు. రచయిత్రి రాజ్యశ్రీ, పొత్తూరి సుబ్బారావు రావూరి భరద్వాజ సాహిత్య విశిష్టతను వివరించారు. కోటేశ్వరరావు నివేదిక సమర్పించగా, రాఘవరెడ్డి స్వాగతం పలికారు. పెద్దూరి వెంకటదాసు సభను నిర్వహించారు. ప్రారంభంలో కోమల శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో: రావూరి కోటేశ్వరరావు రచయిత్రి రాజ్యశ్రీ సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు సంస్థ కార్యదర్శి రాఘవరెడ్డి కవి పెద్దూరి వెంకటదాసు పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ బోధకులతో పాటు ఇంగ్లీష్, పీఈటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**విశ్వంభర, గుండాల:** కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల (కేజీబీవీ), గుండాలలో అగ్రికల్చర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్ విభాగంలో అగ్రికల్చర్ బోధించేందుకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4.00 గంటలలోపు కేజీబీవీ జూనియర్ కళాశాల, గుండాలలో తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నియామకానికి మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పించారు. అగ్రికల్చర్ బోధక పోస్టుకు ఎంఎస్సీ (అగ్రికల్చర్) విద్యార్హత తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.23,000 వేతనం అందజేయబడుతుంది. అదేవిధంగా, ఇంగ్లీష్ మరియు పీఈటీ (ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్) పోస్టులకు కూడా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలియజేశారు.





## నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన గోపాతి సతీష్ కు సన్మానం

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా పని చేసిన డి.నాగరాజు బదిలీపై వెళ్ళగా, అతని స్థానంలో నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన గోపాతి సతీష్ కు విశ్వంభర దినపత్రిక పాత్రికేయులు, మండల పరిధిలోని లక్ష్మాపురం (కొత్తగూడెం) గ్రామ వాస్తవ్యులు దేవిరెడ్డి సత్తిరెడ్డి, వెల్లంకి గ్రామ వాస్తవ్యులు పోలు వెంకట్ రెడ్డి శాలువాతో సన్మానం చేసి నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నూతన ఎస్ఐ గోపాతి సతీష్, చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం

### ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలి: సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ



**విశ్వంభర, భద్రాచలం:** ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత అధికారులు అత్యంత బాధ్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ఎటువంటి సంకోచం లేకుండా నేరుగా ప్రజావాణి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, ప్రతి అర్జీపై నిష్పాక్షికంగా విచారణ నిర్వహించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారుల సమక్షంలో ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతిపత్రాలను స్వీకరించారు. ఒక్కో దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు ఆన్‌లైన్ ద్వారా పంపిస్తూ, సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో నిర్వహిస్తోందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే వేదికపై తమ సమస్యలను తెలియజేసే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలు, భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్‌లు, వారసత్వ హక్కులు, సర్వే సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ యువతకు సంబంధించిన వినతులు, గృహ నిర్మాణ పథకాలు, తాగునీటి సమస్యలు, విద్యుత్ సౌకర్యాలు, రహదారులు, డ్రైనేజీ, విద్య, వైద్యం, వ్యక్తిగత సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని కేవలం నమోదు చేయడానికే పరిమితం కాకుండా, దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించి సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధిపతులపై ఉందన్నారు.

## కొత్తగూడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించిన మంత్రి సీతక్క



**విశ్వంభర, మహబూబాబాద్ జిల్లా:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క సోమవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పాకాల-కొత్తగూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. బి. లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, 2026–27 విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బి.ఏ. (ఇంగ్లీష్ మీడియం), బి.కాం (కంప్యూటర్ సైన్స్ -- ఇంగ్లీష్ మీడియం), బి.ఎస్సీ (లైఫ్ సైన్సెస్ - ఇంగ్లీష్ మీడియం), బి.ఎస్సీ (ఫిజికల్ సైన్సెస్ - ఇంగ్లీష్ మీడియం) కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి కోర్సులో కేవలం 60 సీట్లు మాత్రమే ఉండటంతో విద్యార్థులు త్వరగా అడ్మిషన్ పొందాలని సూచించారు.అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 99081 27796 నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టొప్పో, ఆర్డీవో అలివేలు, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. బి. లక్ష్మణ్ నాయక్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా విశ్వంభర V3 NEWS

# వీధి కుక్కల బెడదకు చెక్ ఎప్పుడు ?





విశ్వంభర, హైదరాబాదు : నగరంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎవరినీ వదలకుండా కుక్కల దాడులు జరుగుతుండటంతో ప్రతిరోజూ పలువురు గాయాలపాలై చికిత్స కోసం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. రోజుకు సగటున 50 నుంచి 60 మంది వరకు కుక్కల కాటుకు వైద్యం పొందుతున్న పరిస్థితి సమస్య తీవ్రతను ప్రతిబింబిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వెళ్లేవారు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు వీధి కుక్కల భయంతో ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల గుంపులుగా సంచరించే కుక్కలు పాదచారులపై దాడి చేయడంతో పాటు ద్విచక్ర వాహనాలను వెంబడించడం వల్ల ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లేందుకు కూడా పలువురు వెనుకంజ వేస్తున్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చెత్త, ఆహార వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోవడం, ఇంటింటి చెత్త సేకరణ వ్యవస్థను కొందరు సక్రమంగా వినియోగించకపోవడం వల్ల వీధి కుక్కలు ఒకేచోట గుమికూడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అపరిశుభ్రమైన పరిసరాలు కుక్కల సంచారానికి అనుకూలంగా మారుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. వీధి కుక్కల జనాభా నియంత్రణ చర్యలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. సమస్య తీవ్రతకు అనుగుణంగా సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేసి వీధి కుక్కల నియంత్రణ, నగర పరిశుభ్రత, చెత్త నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రజల సహకారం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ, వీధి కుక్కల నియంత్రణ చర్యలు ఒకేసారి అమలైనప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచిసున్నారు. భయపడకుండా వీధుల్లో సంచరించే సురక్షిత వాతావరణాన్ని కల్పించడం ఇప్పుడు నగర పాలన ముందున్న కీలక సవాలుగా మారింది.

## ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంపింగ్ యార్డా?

### .జీవోను ఉపసంహరించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్



విశ్వంభర, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు స్థానికులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల ఏ విధంగా నష్టపోతున్నామో వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పక్షాన పోరాడాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. సిద్ధా పూర్ గ్రామంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నం. 641 తీసుకు రావడం అత్యంత దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. పచ్చని వ్యవ సాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలను కోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని విమర్శించారు. సిద్ధాపూర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల ప్రజలంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వెల్లడించారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న గుట్ట చెరువు నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని, ఇక్కడ డంప్ యార్డు పెడితే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటితో పాటు తాగునీటికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ దర్గా పరిసర ప్రాంత స్థానికులతో పాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయమని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డంప్ యార్డుకు కేటాయించిన సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఇక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ సంకల్పించిందని వివరించారు. ప్రభుత్వం వెంటనే సిద్ధాపూర్ డంప్ యార్డు నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, స్థానిక రైతులకు అండగా నిలబడి పోరాడుతుందని హెచ్చరించారు.

## మోసపోయానని వాపోతున్న ఆర్మీ ఎక్స్ సర్వీస్ మెన్ భార్య



విశ్వంభర, అనంతపురం : అనంతపురం జిల్లా అనంతపురం విద్యుత్ నగర్ సర్కిల్లో కె. నాగమణి అనే ఆమెకు 279-2 సర్వే నెంబర్ లో రెండు సెంట్లు స్థలం ఉంది. స్థలం ముందర ఉన్న ఖాళీ ప్లేస్ లో కాల్ సెంట్ స్థలం మీ పేరు మీద చేపిస్తానని పి ప్రవీణ్ కుమార్ రెడ్డి అనే వ్యక్తినమ్మబలికి దానికి అప్రూవల్ తీసుకోవాలని నాగవేణి అనే ఆమెను ధర్మవరం సబ్ రిజిస్టర్ ఆఫీస్ వద్దకు పిలిపించి అక్కడ అప్రూవల్ కోసం సంతకాలు పెట్టాలని చెప్పి సంతకాలు చేపించుకొని ఆ స్థలం అతను సొంతం చేసుకున్నాడని బాధితురాలు వాపోయింది. ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలంటూ మీడియా ముఖంగా అధికారులను వేడుకుంది నాగమణి.

## రామన్నపేటలో ఘనంగా డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి



విశ్వంభర, రామన్నపేట: భారత మాజీ ఉప ప్రధాని, దళితుల నేత డా.బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో రహదారి బంగ్లా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ జమీరుద్దీన్ మాట్లాడుతూ, డా.బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి, సమాజంలోని అణగారిన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నాసర్, బొడ్డు సాలయ్య, బండ అంజిరెడ్డి, బొడ్డు శంకరయ్య, మహమ్మద్ అక్రమ్, మహమ్మద్ రిజ్వాన్, కేశవదాసు, ఉదయ్, మహమ్మద్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వం విఫలం

### : మాజీ మంత్రి పువ్వాడ



విశ్వంభర, ఖమ్మం : పారిశుద్ధ్య నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించి పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఖమ్మం జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. పారిశుద్ధ్యం లోపించడం అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిచోటా చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

## రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి

### స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక

విశ్వంభర, కోల్ సిటీ : రామగుండం నియోజక వర్గానికి మంజూరైన ఈఎస్ఐ ఆస్పత్రి త్వరితగతిన నిర్మించాలని స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. వేదిక ప్రతినిధులు మద్దెల దినేష్, గోలివాడ చంద్రకళ, దుర్గం నగేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రి స్థల సేకరణ, నిర్మాణంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. దీంతో అసంఘటిత కార్మికులు వైద్య సేవలకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.వంద కోట్లు నిధులు మంజూరు చేసినా జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకు పడటం లేదన్నారు. పారిశ్రామిక ప్రాంత ప్రగతికి కార్మికుల ఆరోగ్య భద్రత అత్యంత కీలకమనీ, ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం జరిగితే వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తక్షణమే రామగుండంలో వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి పునాది వేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కంది సుజాత, కొండు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం

విశ్వంభర,కోల్ సిటీ : భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ అన్నారు. జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం జరిగిన వర్ధంతి వేడుకలకు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జిల్లా కార్యదర్శి ఇరుగురాల కృష్ణయ్య, జిల్లా కో-కన్వీనర్ ఆకునూరి బాల అంకుష్లతో కలిసి జగ్జీవన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కో-కన్వీనర్ గజ్జల శశిభూషణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు బొచ్చు శంకర్, ఎంఏ కరీం, కనకం గణేష్, బూడిద సమ్మయ్య, ఆకునూరి రాజయ్య, మడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి' దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు: కలెక్టర్



విశ్వంభర, కరీంనగర్ : ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యమిచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 169 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 67, కరీంనగర్ నగరపాలికకు 54 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

## ప్రణాళికతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి..

### రాజన్నసిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్



విశ్వంభర, సిరిసిల్లా : విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని టీజీటీడబ్ల్యూ ఆర్జేసీ విద్యాలయాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా, వసతి, ఆహార ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా స్టోర్‌రూమ్‌ను సందర్శించిన కలెక్టర్ బియ్యం, పప్పులు, గుడ్లు తదితర నిత్యావసర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని తనిఖీ చేసి, ఆహారం నాణ్యంగా ఉండటంతో పాటు మెనూ ప్రకారమే అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనశాలలో కూర్చొని వారి సమస్యలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం కోడిగుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాలు అందుతున్నాయా అని విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే తప్పకుండా విజయాన్ని సాధించగలరన్నారు. విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విద్యార్థులకు మెరుగైన విద్య, పోషకాహారం, వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



విశ్వంభర, వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర పాపమ్మ కు 2,50,000 వేల రూపాయలు ఎల్ వో సి చెక్కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్నంశెట్టి రాణి మధు వార్డు మెంబర్లు ఆవు శెట్టి పాండు. గండికోట చందన లింగస్వామి. గండికోట సంధ్యా నరసింహ. కాంగ్రెస్ నాయకులు సింగపాక ఊశయ్య. రడపాక శ్రీను. ఆవు శెట్టి ముత్యాలు. రడపాక మహేష్. మంత్రి శివ. తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి

### రైతు సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా



విశ్వంభర, నెల్లికుదురు: పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఐ(ఎంఎల్)రైతు సంఘం ఆధ్వర్యంలో నెల్లికుదురు తహసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఈ మేరకు తాసిల్దార్ చంద నరేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్నలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎరువుల కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసం 50 కిలోల బస్తాకురూ.50 రూపాయల నుండిరూ.300 వరకు పెంచిందని,రైతు పండించిన 13 రకాల పంటలకు రూ.10 నుండి 50 రూపాయల వరకు పెంచి దేశంలో రైతులను ధనికులుగా మారుస్తున్నామని చెప్పటం సిగ్గుచేట న్నారు.ఎరువుల కంపెనీల లాభాల కోసం దేశంలో చిన్న సన్నకారు మధ్యతరగతి రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్న మోడీ ప్రభుత్వంతీరు పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి జక్కుల యాకయ్య, పి వై ఎల్ జిల్లా మాజీ కార్యదర్శి ఇరుగు అనిల్,తో పాటు తోట రవీందర్,సంపత్, కనుకు,మధు, మహేష్ వెంకటమ్మ, లక్మి, తరమ్మ, సుగుణ తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. కాగా తహసిల్దార్ నరేష్ స్పందించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



విశ్వంభర, రామన్నపేట: ప్రముఖ జాతీయవాది, జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ, కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన భారత జాతీయ కాంగ్రెసు విధానాన్ని ముఖర్జీ వ్యతిరేకించాడని, ఒక రాష్ట్రానికి ప్రత్యేక జెండా, ప్రధాన మంత్రి ఉండటాన్ని తీవ్రంగా నిరసించాడని, ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధాన మంత్రులు, రెండు జాతీయ పతాకాలు ఉండటాన్ని సహించలేమని నిరసిస్తూ పోరాటం చేసిన మహనీయుడని అన్నారు. వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్-ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రత్న మంజుల, అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ ఎన్.లక్ష్మీ నీలిమ, డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, ఎం.అనిత, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ ఎం.రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీనుతో పాటు నిర్వాహకులు బాబు, బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 17 నుంచి బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్



విశ్వంభర, బషీర్ బాగ్ : ఈ నెల 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.హైదరాబాద్‌లో తొలిసారి బాగేశ్వర్ సర్కార్ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం నిర్వహించనున్నారు. బాగేశ్వర్ సర్కార్ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న మూడు రోజుల కార్యక్రమాల కోసం సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నిర్వాహకులు అంజనీ కుమార్ అగర్వాల్, సూర్య కమల్ గుప్తా, సంజయ్ అగర్వాల్, రాకేష్ జలాన్, రాకేష్ నర్సింగ్‌పురియా, సందీప్ మిత్తల్, ఘనశ్యామ్ అగర్వాల్, నవీన్ అగర్వాల్, పవన్ తిబ్రేవాల్, అంకిత్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, రూపేష్ అగర్వాల్, శుభమ్ అగర్వాల్ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలి

### : మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

విశ్వంభర, మహబూబ్ నగర్ : అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సూచించారు. కేంద్రం ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల పట్టణంలో బీఎల్‌వో నుంచి ఎన్యూమరేషన్ ఫామ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సర్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ చేరి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలని కోరారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ విజయవంతం చేయాలని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బలమైన ప్రజాస్వామ్యానికి ప్రతి ఓటు విలువైనదే. నా ఓటు.. నా హక్కు అనే భావనతో సర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత అవసరమని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం,వివరాలను సరిచేసుకోవడం, కొత్త ఓటర్లను చేర్చడం అందరి బాధ్యత అని మాజీ మంత్రి పేర్కొన్నారు.

# రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసిన బీఆర్ఎస్ నేతలు

## ఎస్ఐఆర్ ప్రక్రియలో లోపాలపై వినతిపత్రం సమర్పణ



విశ్వంభర, హైదరాబాద్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, సోమా భరత్, కర్నె ప్రభాకర్, వై. సతీష్ రెడ్డి, సుమిత్రానంద్ తదితరులు ఈ బృందంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు పార్టీ తరపున ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, బీఎల్‌వోలు, బీఎల్ఏలతో సమన్వయం చేసేందుకు నియ మించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని, అనేక ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందడం లేదని ఆరోపిం చారు. ప్రక్రియ పూర్తి చేసేందుకు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉండటంతో గడువును పొడిగించాలని ప్రధాన ఎన్నికల అధికారిని కోరినట్లు తెలిపారు. ఈ అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని సీఈఓ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే డూప్లికేట్ ఓట్ల తొలగింపు, ఓటర్ల పేర్లలో ఉన్న గందరగోళాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బీఎల్‌వోలకు తగిన సూచనలు జారీ చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని వినతిప త్రంలో కోరినట్లు వినోద్ కుమార్ వెల్లడించారు.

# జూనోటిక్ వ్యాధుల నివారణకు టీకాలు కీలకం



విశ్వంభర, నారాయణగూడ : పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా జంతువులతో పాటు మనుషుల ఆరోగ్యాన్నీ రక్షించవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు, నిపుణులు తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాదులోని నారాయణగూడ ప్రభుత్వ పశువైద్య ఆసుపత్రిలో "పెంపుడు జంతువులకు టీకాలు వేయండి.. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి" అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా. ఆర్. సురేఖ, హైదరాబాదు జిల్లా పశుసంవర్ధక అధికారి (డీవీఏహెచ్‌వో) డా. ప్రవీణ్ కుమార్, ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ యానిమల్ హెల్త్ ట్రేడ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. శోభన్ బాబు మాట్లాడుతూ పెంపుడు కుక్కలు, పిల్లులు, మేకలు తదితర జంతువులకు రేబిస్‌తో పాటు ఇతర అంటువ్యాధుల నివారణ టీకాలు క్రమం తప్పకుండా వేయించడం ప్రతి యజమాని బాధ్యత అని తెలిపారు. పరిశుభ్రత పాటించడం, సకాలంలో టీకాలు వేయించడం ద్వారా జూనోటిక్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన జంతు ప్రేమికులు తమ పెంపుడు కుక్కలు, పిల్లులు, మేకలకు టీకాలు వేయించుకున్నారు. కార్యక్రమంలో టీకాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించడంతో పాటు జంతు సంరక్షణకు సంబంధించిన సూచనలు అందించారు.

# బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్‌కు గవర్నర్‌కు ఆహ్వానం



విశ్వంభర, హైదరాబాదు : హైదరాబాదులో జులై 14 నుంచి 16 వరకు నిర్వహించనున్న బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్--2026కు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించింది. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణ, లక్ష్యాలు, అంతర్జాతీయ కార్మిక సంఘాల భాగస్వామ్యంపై ప్రతినిధి బృందం గవర్నర్‌కు వివరించింది. కార్మిక సంక్షేమం, శ్రామికుల హక్కులు, ప్రపంచ కార్మిక రంగంలో నెలకొన్న సవాళ్లపై చర్చలకు ఈ సమ్మిట్ వేదికగా నిలవనుందని పేర్కొంది. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గవర్నర్ ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్ చైర్మన్, భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత అధ్యక్షుడు మల్లేశం, సమ్మిట్ ఆర్గనైజింగ్ చీఫ్ కోఆర్డినేటర్, భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారత ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేంద్రన్, తెలంగాణ భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి టి. రామ్ రెడ్డి, తెలంగాణ భారతీయ మజ్దూర్ సంఘ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జె. రామ్ మోహన్ పాల్గొన్నారు.

160వ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహణ

# అంబేద్కర్, జ్యోతిరావు పూలే, గద్దర్ ఆశయాలను స్మరించిన వక్తలు



విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన 160వ జ్ఞానమాల కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ప్రజా నాట్య మండలి మేడ్చల్ జిల్లా కార్యదర్శి వెంకటాచారి, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి ఎస్. శివశంకర్, ఏపీటీఎఫ్ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ సంపత్ కుమార్, పీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ బాలమల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్, జ్యోతిరావు పూలే, గద్దర్ జీవితాలు, వారి ఆశయాలపై ప్రసంగించి, సామాజిక సమానత్వం, విద్య, ప్రజా చైతన్యం కోసం వారు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జి. రాజయ్య, అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ ప్రతినిధులు టి.ఎం. కృష్ణ, పీబి ఓంకార్ అతిథులను శాలువాలతో సన్మానించారు. రిటైర్డ్ ఎస్‌టీవో సి.ఎల్. యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సి.ఎల్. కృష్ణ, మహేందర్, కైసర్, టి. గణేష్, కె. శ్రీనివాస్, కె. చందర్, రవి, రమేష్ ముదిరాజ్, సాయి, చిత్తయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన తెలంగాణ వైభవ నృత్య రూపకం




విశ్వంభర, చిక్కడపల్లి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వైభవాన్ని కూచిపూడి నృత్య రూపంలో ఆవిష్కరించిన చిన్నారుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హైదరాబాదులోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీ జ్ఞాన సరస్వతి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ వైభవం' నృత్య రూపకం ఆహూతుల ప్రశంసలు అందుకుంది. హైదరాబాదు చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీ జ్ఞాన సరస్వతి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ వైభవం' కూచిపూడి నృత్య రూపకం ప్రేక్షకులను అలరించింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జిల్లాల వైభవాన్ని ప్రతిబింబిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు సభికుల ప్రశంసలు అందుకున్నాయి. ముఖ్య అతిథి అంజనా చౌదరి మాట్లాడుతూ, కళలు భారతీయ సంస్కృతిని భావితరాలకు చేరవేసే గొప్ప సాధనమని అన్నారు. గురువు వాణి రమణ శిక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ అభినందనీయమని పేర్కొంటూ, వారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. అకాడమీ కార్యదర్శి వాణి రమణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో కళాప్రతిభతో పాటు సాంస్కృతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అతిథులు, అకాడమీ చిన్నారులు తల్లిదండ్రులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# ఎస్సీ సంక్షేమం కమిటీ చైర్మన్‌గా మేడిపల్లి సత్యం



విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేసింది. సెలెక్ట్ కమిటీ చైర్మన్‌గా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాలను పరిశీలించే ఈ కమిటీలో 13 మంది సభ్యులు ఉండనున్నారు. జాయింట్ కమిటీకి కడియం శ్రీహరి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. 11 మంది సభ్యులు, ఛైర్మన్‌తో జాయింట్ కమిటీ పనిచేయనుంది. అమినిటీస్ కమిటీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేతృత్వం వహించనున్నారు. అమినిటీస్ కమిటీలో 11 మంది సభ్యులు ఉంటారు. ఎస్సీ సంక్షేమం కమిటీ ఛైర్మన్‌గా మేడిపల్లి సత్యంను ఎంపిక చేశారు. 11 మందితో కూడిన సభ్యుల బృందం ఈ కమిటీ విధుల్లో పాలుపంచుకోనుంది.

# వ్యాయామశాలల అభివృద్ధికి సహకరిస్తా

## ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్




విశ్వంభర, హైదరాబాద్ : తన జీవితకాలం పాటు జాతీయ, అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు హాజరయ్యే రెజ్లర్లకు అవసరమైన సహకారాన్ని అందిస్తానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నగరంలోని వ్యాయామశాలల నిర్వాహకులు, రెజ్లర్లతో తలసాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. వ్యాయామ శాలల అభివృద్ధికి, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన రెజ్లర్లకు తన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పోటీలకు హాజరయ్యే రెజ్లర్ల వెంట వెళ్లే కోచ్‌లకు కూడా అవసరమైన సహకారాన్ని అందిస్తానని తెలిపారు. తాను ఏ ప్రయోజనాలను ఆశించి ఇంత పెద్ద సహకారం అందించడం లేదని, తనకు రెజ్లింగ్‌పై ఉన్న అభిమానంతో చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఈ నెల 24వ తేదీన అదేరోజు తెలంగాణ భవన్‌లో మోడల్ రెజ్లింగ్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పలువురు వ్యాయామశాలల నిర్వాహకులు, రెజ్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కేవీఆర్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



విశ్వంభర, ఎల్‌బీ నగర్: బైరామల్‌గూడలో నివాసముంటున్న జర్నలిస్టు కే. వెంకట్ రామ్ రెడ్డి (కేవీఆర్)ను ఇటీవల ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో, ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకా రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ రామ్ నరసింహ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బింగి భరత్ గౌడ్, సూర్వి యాదయ్య గౌడ్, యాదగిరి, తుప్పటి శ్రీకాంత్, నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

# సిటీ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో 'క్లీన్ క్యాంపస్' కార్యక్రమం




విశ్వంభర, హైదరాబాద్: ఏబీవీపీ సిటీ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ప్రాంగణంలో 'క్లీన్ క్యాంపస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలై 9న జరగనున్న ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిటీ కళాశాల ఏబీవీపీ అధ్యక్షుడు అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ఆవరణను శుభ్రపరిచి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తను చెత్తబుట్టల్లోనే వేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రమైన క్యాంపస్ నిర్మాణానికి ప్రతి విద్యార్థి సహకరించాలని అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. నాగరాజు, ఏబీవీపీ కమిటీ సభ్యులు అరవింద్, అఖిల్, మనీష్, సన్నీ, జతిన్, అమన్, సాహితీ, హర్షిత, చిన్మయి, శివ, అభిషేక్, సాగర్, నిహార్, రాజేష్, భాను, రాహుల్, బన్నీ, టింకు, నవనీత్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# చేపల ఉత్పత్తి పెంపుతో మత్స్యకారుల ఆదాయం రెట్టింపు

## రాజన్నసిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్

విశ్వంభర, సిరిసిల్ల : ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్య అభివృద్ధి పథకాలు గ్రామీణ మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేస్తున్నాయని, చేపల ఉత్పత్తి పెరగడంతో వారి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని రాజన్నసిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కమిటీ సభ్యులు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్‌తో సమావేశమై జిల్లాలో అమలవుతున్న మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సహకార సంఘాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, చేప పిల్లల ఉత్పత్తి, మార్కెటింగ్, మత్స్యకారుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను కలెక్టర్ బృందానికి వివరించారు. అనంతరం బృందం బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి ఉత్పత్తి విధానం, నిర్వహణ, ఆదాయ వనరులు, ప్రభుత్వ సహకారంపై క్షేత్రస్థాయిలో పరిశీలించింది. చేపల ఉత్పత్తి పెంపుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు మత్స్యకార కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అధికారులు వివరించారు. ఈ పర్యటనలో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు జూలియన్ మిలియన్, అనుజా శుక్లా, ఆర్వీ సిలార్డ్, ఇంతిసార్ ఎ. సిద్దిఖీ, దీపా సుమన్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# బురద రోడ్డుపై నాట్లేసి నిరసన తెలిపితే దాడులు చేస్తారా..?

## చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



విశ్వంభర, మల్యాల: 'ప్రశాంతంగా ఉన్న చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ అలజడి సృష్టిస్తున్నది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, అభివృద్ధిపై ప్రశ్నించే గొంతులను బెదిరిస్తూ దాడులు చేస్తున్నది. ఇంకెన్నాళ్లీ రౌడీయిజం?' అంటూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఫైర్ అయ్యారు. ఆదివారం మల్యాలలోని 8వ వార్డులో బురదమయంగా మారిన రోడ్డును బాగుచేయాలంటూ బీఆర్ఎస్ నాయకుడు దొంతరవేణి శేఖర్ వరి నాటు వేసి నిరసన తెలిపాడని, రాత్రి అతడి ఇంటికి రాజారాం గ్రామానికి చెందిన గుర్రం శ్రీకాంత్, నూకపల్లి సర్పంచ్ చెవులమద్ది శ్రీనివాస్, పలువురు వ్యక్తులు వెళ్లి దాడికి యత్నించారని, పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది రావడంతో వెళ్లిపోయారని మండిపడ్డారు. సోమవా రం ఉదయం బాధితుడు శేఖర్, మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి సుంకె మల్యాల ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామాభివృద్ధి విషయంలో శేఖర్ ప్రశ్నిస్తే దాడి చేయాల్సిన అవసరం ఏం వచ్చిందని, వ్యక్తులనుగానీ, వారి నాయకుడిని గానీ ఏమి అనలేదు కదా? అని ప్రశ్నించారు. ఇటీవల కొడిమ్యాల మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ మల్లేశం మీదా కాంగ్రెస్ శ్రేణులు దాడులు చేయడమేకాకుండా అట్రాసిటీ కేసు పెట్టించారని దుయ్యబట్టారు. చొప్పదండి నియోజకవర్గంలో గుండా, రౌడీ కల్చర్ పెరుగుతున్నదని ఆగ్రహించారు. ప్రశ్నించే వ్యక్తులపై దాడులు చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. తీరుమార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులకు పోలీసులు తలొగ్గవద్దని, చట్టబద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వానికి చేతనైతే 420 హామీలను అమలు చేయాలని, కొండగట్టు ఆలయ అభివృద్ధిలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన సంతలోని లొద్ది పంప్‌హౌస్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శేఖర్‌పై దాడి విషయంలో మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేశామని, పోలీసులు కేసు నమోదు చేయకపోతే త్వరలోనే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

# మోడల్ స్కూల్, కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

## ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు



విశ్వంభర, నెల్లికు దురు: మండ ల కేంద్రం నెల్లికు దురులోని పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, జూనియర్ కళాశా లల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 6వ, 7వ, 8వ తరగతులు,ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ, బైపీసీ,సీఈసీ) కోర్సుల లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతున్నట్లు ప్రిన్సిపాల్ జి.ఉపేందర్ రావు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తమ విద్యాసంస్థలో ఆంగ్ల మాధ్యమ బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, డిజిటల్ తరగతి గదులు,సైన్స్ ల్యాబ్‌లు,అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, క్రీడా సౌకర్యాలు మరియు ప్రభుత్వ నిబంధనల మేరకు వివిధ విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఇంటర్మీడియట్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం (సీట్ల లభ్యత మేరకు) కలదని తెలిపారు. అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవసరమైన ధ్రువపత్రాలతో వెంటనే పాఠశాలను సంప్రదించి స్పాట్ అడ్మిషన్ పొందాలని,సీట్లు పరిమితంగా ఉన్నందున ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత లభిస్తుందని వివరించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను వారి తల్లిదండ్రులను కోరారు.

# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



విశ్వంభర, హైదరాబాద్ :ఆధ్యాత్మిక తోనే మానసిక ప్రశాంతత అని మలక్ పేట్ వైశ్య బాలికల హాస్టల్ అధ్యక్షులు పాల మధుసూదన్, మలక్ పేట్ ఉద్యోగుల వసతి గృహాల సముదాయ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ అన్నారు.ఆదివారం నాడు తిరుమల హిల్స్ లో ఇటీవల యాదగిరిగుట్ట పాలక మండలి సభ్యులు గా నియమింపబడిన జి.మల్లయ్యకు శాలువా లతో ఘనంగా సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ యువత లో ఈనాడు ఆధ్యాత్మిక భావన లేకపోవడం వల్ల మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని అన్నారు.యాదగిరి గుట్ట బోర్డు మెంబర్ జి.మల్లయ్య మాట్లాడుతూ ఏ పదవైన హోదా కోసమో, విజిటింగ్ కార్డ్ కోసమో కాకుండా అంకిత భావంతో పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మలక్ పేట్ యోగా సభ్యులు సురేష్ బాబు, మల్లారెడ్డి,ప్రభు,విజయ్ కుమార్, కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# జన్నారం కాలనీలో సీఐటీయూ నూతన కమిటీ ఏర్పాటు



విశ్వంభర, మేడ్చల్: కీసర మండలం రాంపల్లి జన్నారం కాలనీలోని సీఐటీయూ యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాల కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. నూతన కమిటీలో కన్వీనర్‌గా కలువల శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా సిలివేరు సుదర్శన్ ఎన్నికయ్యారు. ఇతర కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.



# లెనిన్‌లో ఎన్టీఆర్ 'టైగర్' రోల్!

అక్కినేని అఖిల్ లెనిన్ మరో నాలుగు రోజుల్లో థియేటర్లలో సందడి చేయనుంది. ఈ క్రమంలో సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. ఎరుపు రంగుతో ఉన్న ఈ పోస్టర్‌లో బ్యాగ్రౌండ్‌లో గంభీరమైన టైగర్ లుక్ ఉంది. పైన లెనిన్ లోగో మాత్రమే ఉంది. ఇంకెవరి ఫొటో కూడా ఇందులో లేదు. ఆ తర్వాత కాసేపటికే మేకర్స్ అదిరే అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా కోసం తారక్ పనిచేసినట్లు అధికారికంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. దీంతో సినిమా మేకింగ్‌లో మ్యాన్ ఆఫ్ మాసెస్,యంగ్ టైగర్ ఎన్టీఆర్ పాత్ర కూడా ఉందని అక్కినేని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

ఏంటి లింక్?

ఈ సినిమా ట్రైలర్ అక్కినేని నాగార్జున వాయిస్ ఓవర్‌తో ప్రారంభమౌతుంది. 'ఇది మా మహాభారతం' అంటూ నాగ్ డైలాగ్‌తో షురూ అయ్యింది. దీని గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నాగవంశీని అడగ్గా, ట్రైలర్ కోసం నాగార్జున తన వాయిస్ ఓవర్ ఇచ్చారని అన్నారు. అయితే ట్రైలర్ వరకే పరిమితమని, సినిమాలో మరో స్టార్ హీరో వాయిస్ ఓవర్ ఉంటుందని నాగవంశీ అప్పుడే చెప్పేశారు. ఆయనే వాయిస్‌తోనే స్టోరీ నరేషన్ ఉంటుందని హైప్ పెంచేశారు. తాజాగా ఆ హీరో ఎవరో రివీల్ చేశారు. ఆ హీరో ఎవరో కాదు ఎన్టీఆరే అని రివీల్ చేసేశారు. లెనిన్ సినిమాలో ఎన్టీఆర్ తన వాయిస్ అందించినట్లు ప్రకటన చేశారు. తారక్ వాయిస్ ఓవర్‌తోనే స్టోరీ నరేషన్ ఉండనుందన్నమాట! స్క్రీన్‌పై అఖిల్ యాక్షన్ సీన్స్‌కు బ్యాగ్రౌండ్‌లో తారక్ వాయిస్ తోడైనట్లైతే పూకనాలే అని అక్కినేని ఫ్యాన్స్ అంటున్నారు. నిజానికి ఎన్టీఆర్ వాయిస్‌లో ఉండే బేస్ గంభీరంగా ఉంటుంది. 'దృఢ సంకల్పంతో ఆవిర్భవించిన ప్రపంచం. పరిచయమే అవసరం లేని ఆ వాయిస్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. మాన్ ఆఫ్ మాసెస్, జూనియర్ ఎన్టీఆర్ లెనిన్ సినిమా ఆరంభంలో శ్రీరామపురాన్ని తన వాయిస్‌తో మీకు పరిచయం చేయనున్నారు' పోస్టుకు రాసుకొచ్చారు. దీనికి సంబంధించిన డబ్బింగ్ కూడా ఇవాళ చేసినట్లు తెలుస్తోంది. గతంలోనూ కాగా, ఇతర హీరోల సినిమాలకు వాయిస్ ఓవర్ అందించడం ఎన్టీఆర్‌కు ఇది కొత్తేం కాదు. ఆయన వాయిస్ అందించి ఇతర హీరోల చిత్రాలను కూడా ప్రోత్సహిస్తుంటారు. గతేడాది గౌతమ్ తిన్ననూరి విజయ్ దేవరకొండ కాంబోలో వచ్చిన కింగ్‌డమ్ సినిమాకు తారక్ వాయిస్ ఇచ్చారు. దీంతోపాటు గతంలో రామరామ కృష్ణకృష్ణ, విరూపాక్ష సినిమాలకు వాయిస్ ఓవర్ అందించారు. మురళీ కిషోర్ అబ్బూర్ ఈ సినిమాను రూరల్ బ్యాక్‌డ్రాప్, ఫ్యామిలీ ఎంటర్టైనర్ డ్రామాగా తెరకెక్కించారు. ఇందులో భాగ్యశ్రీ భోర్సే హీరోయిన్‌గా నటించింది. సీనియర్లు బ్రహ్మాజీ, సునీల్, శివాజీ కీలక పాత్రలు పోషించారు. తమన్ సంగీతం అందించిన ఈ సినిమాను అన్నపూర్ణ, సితార బ్యానర్లపై నాగార్జున, నాగవంశీ కలిసి నిర్మించారు. జులై 10న లెనిన్ సినిమా థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.



## వర్చువల్‌గా విచారణకు హాజరైన అల్లు అర్జున్

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు విచారణలో టాలీవుడ్ యాక్టర్ అల్లు అర్జున్‌కు వర్చువల్‌గా హాజరయ్యేందుకు నాంపల్లి కోర్టు అనుమతినిచ్చింది. అల్లు అర్జున్ ముంబైలో సినిమా షూటింగ్‌లో ఉండడంతో నాంపల్లి కోర్టు వర్చువల్ విధానానికి అనుమతినిచ్చింది. ఈ మేరకు అల్లు అర్జున్ నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట విచారణకు హాజరయ్యాడు. అయితే ఈ కేసుకు సంబధించి మిగిలిన నిందితులు హాజరు కాకపోవడంతో నాంపల్లి కోర్టు ఈ కేసు విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ కేసులో 23 మంది నిందితులపై 500 పేజీల ఛార్జ్‌షీట్ కాపీలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు సమర్పించారు. గత విచారణకు కూడా అల్లు అర్జున్ వర్చువల్‌గానే హాజరయ్యాడని తెలిసిందే. మొత్తం 23 మంది నిందితులు హాజరరైతేనే తదుపరి విచారణ ఉంటుందని కోర్టు గతంలో తెలిపింది.



## శ్రీవారిని దర్శించుకున్న అక్కినేని ఫ్యామిలీ

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువుదీరిన తిరుమలను సోమవారం సినీ ప్రముఖులు పలువురు దర్శించుకున్నారు. అక్కినేని నాగార్జున కుటుంబంతో పాటు, తమిళ నటుడు మాధవన్ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. నాగార్జున కుమారుడు అఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్' ఈనెల 10న విడుదల కానున్నందున ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు తిరుపతిలో జరగనున్నాయి. ఈ సందర్భంగా నాగార్జున, ఆయన సతీమణి అమల, అఖిల్, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే, సునీల్, నిర్మాత నాగవంశీ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదల ప్రకారం అర్చకులు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న 'ఓ సుకుమారి'

ఐశ్వర్య రాజేశ్, తిరువీర్ జంటగా నటించిన 'ఓ సుకుమారి' సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేసింది. ఫాంటసీ అంశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని జులై 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర రెడ్డి మూలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజకీయ నాయకుడు కావాలనుకునే ఓ యువకుడు, సుకుమారి (ఐశ్వర్య రాజేష్) అనే పల్లెటూరి అమ్మాయి ప్రేమలో పడతాడు. అయితే ఆమెను ఎవరు తాకినా షాక్ కొట్టడం అనే విచిత్రమైన సమస్య చుట్టూ కథనం హాస్యభరితంగా, ఆసక్తికరంగా సాగుతుందని తెలుస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. తెలుగుతో పాటు తమిళం, ఇతర భాషల్లోనూ ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. U/A సర్టిఫికెట్ రావడంతో ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని అంచనాలు నెలకొన్నాయి.

## మండోదరిగా కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్లు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టుల్లో నటించినప్పుడు వారి పాత్రలపై అభిమానుల్లో సహజంగానే భారీ అంచనాలు ఉంటాయి. అయితే కథ స్వభావం కారణంగా కొన్ని పాత్రలకు స్క్రీన్ టైమ్ పరిమితంగానే ఉండొచ్చు.అలాంటి సందర్భాల్లోసినిమా రిలీజ్ తర్వాత వచ్చే విమర్శల కంటే ముందుగానే వాస్తవ పరిస్థితిని చెప్పడం మంచిదనే అభిప్రాయం ఉంటుంది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ కూడా అదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. రెండు భాగాలుగా రూపొందుతున్న భారీ సినిమా రామాయణలో ఆమె మండోదరి పాత్రలో కనిపించనుండగా, తన పాత్ర నిడివి ఎక్కువగా ఉండదని స్వయంగా వెల్లడించింది. మొదటి భాగంలో లంకకు సంబంధించిన ఎపిసోడ్లు తక్కువగా ఉండటంతో తన పాత్ర కూడా పరిమితంగా ఉంటుందని ఆమె చెప్పడం ఆసక్తికరంగా మారింది. మండోదరి పాత్రను పరిశీలిస్తే, సంప్రదాయ రామాయణ కథల్లోనూ ఆమెకు విస్తృతమైన స్క్రీన్ ప్రెజెన్స్ ఉండదు. అందువల్ల కొత్త వెర్షన్‌లో కూడా పాత్ర పరిధి కథ అవసరాలకు అనుగుణంగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే పాత్ర చిన్నదైనా, కథలో కీలకమైన సందర్భాల్లో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అభిమానులు ముందుగానే ఈ విషయాన్ని తెలుసుకుంటే రిలీజ్ తర్వాత అనవసరమైన నిరాశకు తావు ఉండదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, ఈ సినిమాలో రావణుడి పాత్ర పోషిస్తున్న యశ్‌తో కలిసి నటించడం తనకు మంచి అనుభవంగా నిలిచిందని కాజల్ పేర్కొంది. సినిమా కోసం ఆయన చూపుతున్న డెడికేషన్ ను ఆమె ప్రశంసించింది. అలాగే, పాత్ర నిడివి కంటే ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగం కావడానికే ఎక్కువ విలువ ఉందని ఆమె స్పష్టం చేసింది. కెరీర్‌లో కొత్త దశలో ఉన్న కాజల్‌కు ఇలాంటి భారీ సినిమాలో అవకాశం దక్కడం ఆమె ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా సినీ విశ్లేషకులు చూస్తున్నారు.



# చిత్రపరిశ్రమలో ఇంకా పురుషాధిక్యతే..: కృతి సనన్

సినీ పరిశ్రమ వెలుపల నుంచి చూస్తే గ్లామర్, స్టార్‌డమ్ మాత్రమే కనిపిస్తాయి. కానీ ఆ మెరుపుల వెనుక ఎన్నో అసమానతలు, సవాళ్లు, వివక్ష కూడా ఉంటాయని పలువురు నటీమణులు గతంలో వెల్లడించారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొనే జెండర్ వివక్షపై బహిరంగంగా మాట్లాడి చర్చనీయాంశంగా మారారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి సనన్.. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా సినిమా ప్రమోషన్స్ సమయంలో ఓ హీరో తనను కావాలనే పక్కన పెట్టేందుకు ప్రయత్నించాడని, తాను ఏ ప్రమోషనల్ ఈవెంట్‌కు హాజరుకావాలో కూడా ఆయనే నిర్ణయించాలనుకున్నాడని తెలిపారు.అలాంటి పరిస్థితి తనకు తీవ్ర అవమానంగా అనిపించిందని, నా అవసరం లేదనుకుంటే మీరు ఒక్కరే సినిమా ప్రమోట్ చేసుకోండి అని చెప్పి తాను వెనక్కి తగ్గినట్లు వెల్లడించారు. సినిమా సెట్స్‌లో కూడా మహిళా నటీమణులకు, పురుష నటులకు ఇచ్చే ప్రాధాన్యంలో స్పష్టమైన తేడా కనిపించేదని కృతి అన్నారు. హీరోలకు పెద్ద వానిటీ వాన్లు, విశాలమైన గదులు, లగ్జరీ కార్లు ఏర్పాటు చేస్తే.. హీరోయిన్లకు మాత్రం చిన్న గదులు, సాధారణ వాహనాలు కేటాయించేవారని చెప్పారు. తనకు గదుల పరిమాణం లేదా కార్లపై ఆసక్తి లేదని, కానీ అలాంటి తేడాలు మహిళలను తక్కువగా చూసే భావనను కలిగిస్తాయని ఆమె వ్యాఖ్యానించారు. సీనియర్ హీరోల విషయంలో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు సహజమేనని అంగీకరించిన కృతి.. కొత్తగా వచ్చిన హీరోల విషయంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్లు హీరో సమయాన్ని దృష్టిలో పెట్టుకుని హీరోయిన్లను గంటల ముందే సెట్స్‌కు పిలిచి వేచి ఉండేలా చేసేవారని ఆమె విమర్శించారు.

తాను నటనలో ప్రొఫెషనల్ ట్రైనింగ్ తీసుకోకపోవడంతో పాత్ర గురించి దర్శకులను ప్రశ్నిస్తే లేదా ఏదైనా సూచన చేస్తే.. నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావ్ అంటూ తన మాటలను పట్టించుకునేవారు కాదని కృతి తెలిపారు. అయితే అదే విషయాన్ని ఓ పురుష నటుడు చెబితే వెంటనే అంగీకరించి, అతని సూచనకు ప్రాధాన్యం ఇచ్చేవారని ఆమె పేర్కొన్నారు. మహిళలు అభిప్రాయం చెబితే దాన్ని అతిగా చూస్తారని, పురుషులు మాట్లాడితే మాత్రం దాన్ని వారి కమిట్‌మెంట్‌గా భావిస్తారని ఆమె విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో మౌనంగా ఉండడం కంటే, సమాన గౌరవం కోసం గొంతు విప్పడం అవసరమని కృతి సనన్ అభిప్రాయపడ్డారు. కార్యాలయంలో గానీ, సినిమా సెట్స్‌లో గానీ మహిళలకు సమాన అవకాశాలు, గౌరవం దక్కాలని ఆమె కోరారు.

## ఫస్ట్ మ్యాచ్‌లో ఫెయిల్.. వైభవ్‌కు రెండో ఛాన్స్ ఇస్తారా?

విశ్వంభర, స్పోర్ట్స్ : టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఒక్క మ్యాచ్‌కే పక్కన పెట్టనున్నారా? అంటే అవునానే క్రికెట్ వర్గాలు. మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో వైభవ్ అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. భారత్ తరపున డెబ్యూ చేసిన అతి పిన్నవయష్కుడిగా చరిత్రను తిరగరాసిన సూర్యవంశీ.. తన మొదటి మ్యాచ్‌లో మాత్రం విఫలమయ్యాడు. సీనియర్ బ్యాటర్ సంజూ శాంసన్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన వైభవ్, తన మార్క్‌ను చూపించలేకపోయాడు. 10 బంతులు ఎదుర్కొని కేవలం 14 పరుగులు చేసి నిరాశపరిచాడు. దీంతో శాంసన్‌ను తిరిగి ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకు రావాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అండ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే మూడో టీ20లో భారత్ కచ్చితంగా గెలవాల్సిందే. ప్రస్తుతం ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 10 ఆధిక్యంలో ఉంది. దీంతో కీలకమైన మూడో టీ20లో శాంసన్ తిరిగి ఆడనున్నట్లు సమాచారం.

టీ20 ప్రపంచకప్2026లో ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీగా నిలిచిన శాంసన్.. యూకే పర్యటనలో మాత్రం తీవ్ర నిరాశపరిచాడు. వరుసగా మూడు మ్యాచ్‌లలో సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యాడు. ఈ క్రమంలోనే అతడిని పక్కన పెట్టి వైభవ్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. కానీ అతడు కూడా విఫలం కావడంతో సీనియర్ అయిన సంజూకే మళ్లీ అవకాశమివ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఈ నెలఖారులో జింబాబ్వేతో జరిగే టీ20 సిరీస్‌లో వైభవ్‌ను పూర్తి స్థాయిలో ఆడించే యోచనలో మేనెజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. కాగా మూడు టీ20ల సిరీస్ కోసం భారత క్రికెట్ జూలై ఆఖరిలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్ సీనియర్ ప్లేయర్ అభిషేక్ శర్మకు విశ్రాంతి ఇచ్చే అవకాశముంది. ఈ క్రమంలో వైభవ్ భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించేందుకు అస్కారం ఉంది.



## మెదక్‌పై ఖమ్మం ఘన విజయం

### ఐదో విజయంతో ప్లేఆఫ్స్‌కు చేరిన ఖమ్మం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీజీ 20 లీగ్‌లో అన్విత ఖమ్మం ఏసెస్ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. గ్రూప్ స్టేజ్ ఆఖరి మ్యాచ్‌లో మెదక్ ఫాల్కన్స్‌తో తలపడ్డ ఖమ్మం జట్టు 19 పరుగుల తేడాతో నెగ్గింది. 191 పరుగుల ఛేదనలో మెదక్ ఓవర్లన్నీ ఆడి 1717 స్కోర్ మాత్రమే చేయగలిగింది. శృంజిత్ రెడ్డి (60 పరుగులు) పోరాటం వృథా అయ్యింది. మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించలేదు. ఖమ్మం బౌలర్లలో హర్షిత్, విద్యానంద్ రెడ్డి, వాఫీ కచ్చి తలో 2, వేద్ రెడ్డి 1 వికెట్ దక్కించుకున్నారు. ఈ మ్యాచ్‌తో ప్రస్తుత టోర్నీలో మెదక్ ఫాల్కన్స్ జర్నీ ముగిసింది. తాజా విజయంతో ఖమ్మం గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు కూడా ముగిశాయి. గ్రూప్ దశలో ఏడు మ్యాచ్‌లు ఆడిన ఖమ్మం ఐదింట నెగ్గింది. దీంతో పాయింట్ల పట్టికలో ప్రస్తుతం రెండో (10 పాయింట్లు) స్థానంలోకి దూసుకెళ్లింది. అలాగే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. మరోవైపు మెదక్ ఏడింట కేవలం ఒకే మ్యాచ్‌లో నెగ్గి పట్టికలో అట్టడుగున నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. కొడిమెల హిమతేజ (103 పరుగులు నాటౌట్) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. ప్రతీక్ రెడ్డి (32 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. చివర్లో కెప్టెన్ చామా వి మిలింద్ (14 పరుగులు) బాదాడు. ఓపెనర్లు వాఫీ కచ్చి (14 పరుగులు), జీఎస్కే రెడ్డి (0) మరోసారి విఫలమయ్యారు. గత మ్యాచ్‌లో ఆకట్టుకున్నా జైస్వాల్ (15) ఈసారి భారీ చేయడంలో ఫెయిల్ అయ్యాడు. మెదక్ బౌలర్లలో కెప్టెన్ రవితేజ 2, మన్నె మధుకర్, గౌర్రపల్లి అర్జున్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com